క్లుప్తంగా

రేపు రక్తదాన శిబిరం

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో గురువారం రక్తదానం శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బుద్ధపౌర్ణమిని పురస్కరించుకుని ఆస్పత్రి సిబ్బందిచే రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని, రక్తదానం చేసినవారికి ఆరోగ్యం కూడా బాగా ఉంటుందని తెలిపారు. యువకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వికసించిన మే పుష్పాలు



గుర్రంకొండ: పట్టణంలోని స్థానిక కడపరోడ్‌లోని రమణ అనే వ్యక్తికి చెందిన ఇంట్లో మంగళవారం మే పుష్పాలు వికసించాయి. ఏడాదికి ఒకమారు వికసించడం వీటి ప్రత్యేకత. ఎంతో ఆకర్షణగా ఉండే ఈ పుష్పాలు అందర్ని ఆకట్టుకొంటున్నాయి.

సర్వభూపాల వాహనంపై వెంకన్న



మదనపల్లె సిటీ : సర్వభూపాల వాహనంపై మెరిసిన ఆ దేవదేవుడిని కనులారా వీక్షించిన భక్తజనులు పులకించారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం సర్వభూపాల వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.వాహనాన్ని అధిరోహించిన శ్రీవారికి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేసి, హారతులిచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, అర్చకులు,పండితుల వేదమంత్రోచ్చరణలతో శ్రీవారి వాహనం ఆలయ పుర వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శించుకుని తరించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులు భరతనాట్యం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, మాజీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు చిన్నక్కమ్మ, పెద్దక్కమ్మ తిరునాల

కేవీపల్లె : మండలంలోని నూతనకాల్వలో వెలసిన చిన్నక్కమ్మ, పెద్దక్కమ్మ తిరునాల బుధవారం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మొలకల పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఉదయం అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం నుంచి భక్తులకు అన్నదానం కార్యక్రమం, రాత్రి చాందినీ బండ్లు ఊరేగింపు ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చౌడసముద్రంలో పోలీసుల కార్డన్‌సర్చ్



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ములకలచెరువు: మండలంలోని చౌడసముద్రంలో పోలీసులు మంగళవారం కార్డర్‌సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం, నాటుసారా విక్రయాలు జరిపే దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ తిప్పేస్వామి మాట్లాడుతూ... గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జూదం, మద్యం విక్రయాలు నిర్వహిస్తే సమాచారం అందించాలన్నారు. పీటీయం, బి.కొత్తకోట పోలీసులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ములకలచెరువు: సచివాలయం సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ పోలప్ప హెచ్చరించారు. మంగళవారం ఆయన పెద్దపాళ్యం, కదిరినాథునికోట, పాత ములకలచెరువు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

నేత్రపర్వం.. నరసింహ స్వామి కల్యాణం

పెద్దతిప్పసముద్రం: సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ఎగవకోటలోని నరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. వేద పండితులు వేణుగోపాల స్వామి, ఖన్నాస్వామిలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.

సరైన సమయం.. స్పందిస్తే ప్రయోజనం

- చెరువుల్లో కంపచెట్ల తొలగింపునకు సరైన సమయం
- వర్షాలతో చెరువుల్లోకి చేరుతున్న వర్షపునీరు
- కంపచెట్ల తొలగింపుతో అందరికి ఎంతో మేలు
- మూగజీవాలకు తీరనున్న తాగునీటి సమస్య
- ఉపాధిలో మినీఅమృత సరోవర్‌తో అవకాశం



ఏనుగుల చెరువులో కంపచెట్లు నిండిపోయి రూపరేఖలు మారిపోయిన దృశ్యం

నియోజకవర్గంలోని చెరువులు, కుంటల వివరాలు

మండలం పేరు	చెరువులు, కుంటల సంఖ్య
గుర్రంకొండ	125
పీలేరు	232
కేవిపల్లె	175
కలికిరి	178
వాల్మీకిపురం	157
కలకడ	119
మొత్తం	986

గుర్రంకొండ : నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు కంపచెట్లతో నిండిపోయాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కంపచెట్ల తొలగింపునకు ఇదే సరైన సమయమని రైతులు అంటున్నారు. చెరువుల్లో కంపచెట్లు తొలగిస్తే వర్షపు నీరు చెరువులో నిలిచి అందరికి ఎంతో మేలు జరుగుతుందని, ముఖ్యంగా మూగజీవాలకు తాగునీటి సమస్య తీరుందని రైతులు అంటున్నారు. ఉపాధిహామీ పథకంలో మినీ అమృత్ సరోవర్ పథకం చెరువు అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. సరైన సమయంలో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొంటే రైతులు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

కంపచెట్లతో నిండిపోయిన చెరువులు

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో మొత్తం 986 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో 38 మేజర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం చెరువుల్లో పెద్ద ఎత్తున కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో ఇక్కడ చెరువు ఉన్న ఆనవాళ్లే కనిపించడం లేదు. చివరకు చెరువు కట్టల మీద కూడా కంపచెట్లు పెరిగిపోవడంతో కట్టల పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. వీటితో పాటు ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఎక్కువగా పెరిగిపోయాయి. ఎండిపోయిన ముళ్లకంపలు చెరువుల్లో ఎక్కడ పడితే అక్కడ కుప్పలు తెప్పలుగా పడి ఉన్నాయి. దీంతో మనుషులకానీ, పశువులుగానీ చెరువుల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

వర్షాలకు చేరువుల్లోకి చేరుతున్న నీరు

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వంకలు సాగి కొద్ది వర్షపు నీరు చెరువుల్లో చేరుతోంది. వర్షాలు కురిసి వంకలు సాగినా.. వర్షపు నీరు చెరువుల్లోకి చేరి నిల్వ ఉండే అవకాశం కనిపించడం లేదు. ఏదో కొద్ది పాటిగా చేరే నీరు మొత్తం ఈ కంపచెట్లకే సరిపోతోంది. ఏళ్ల తరబడి వీటి గురించి పట్టించుకోక పోవడంతో చెరువుల రూపరేఖలు మారిపోయాయి. ఒక్కప్పుడు వర్షపునీటితో కళకళలాడే చెరువులు నేడు ముళ్లకంపలు, కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుం చెరువుల్లో నీరు చేరినా ఎవరికి ప్రయోజనం కలగదని రైతులు అంటున్నారు. చెరువుల్లో పేరుకుపోయిన ముళ్ల కంపలతో మనుషులుగానీ, మూగజీవాలుగానీ చెరువుల్లో అడుగు పెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి.

మూగజీవాలకు తీరనున్న తాగునీటి సమస్య

చెరువుల్లో ముళ్లపొదలు, కంపచెట్లు తొలగిస్తే మూగజీవాలకు తాగునీటి సమస్య తీరుతుంది. ప్రస్తుతం మేకలు, గొర్రెలు, పాడిఆవులకు తాగునీటి సమస్య ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటల్లో నీరు చేరుతోంది. ఈ వర్షపు నీరు కొద్దిరోజులపాటు ఎండ వస్తే ఇంకిపోనున్నాయి. ముళ్లపొదలు, కంపచెట్ల కారణంగా మూగజీవాలు చెరువుల్లోకి వెళ్లలేని పరిస్థితి ఉంది. రానున్న నైరుతి రుతుపవనాల కారణంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నాయి. ఈలోగా చెరువుల్లో ముళ్లపొదలు, కంపచెట్లు తొలగిస్తే మూగజీవాలకు తాగునీటి సమస్య తీరుతుంది.

మినీ అమృత్ సరోవర్ పథకం వైపు రైతుల చూపు

చెరువుల్లో ముళ్లపొదలు, కంపచెట్ల సమస్య పరిష్కారం కోసం ఉపాధిహామీ పథకం వైపు ఆయుకట్టు రైతులు చూస్తున్నారు. గతంలో ఉపాధిహామీ పథకంలో చెరువుల్లో ముళ్ల కంపల తొలగింపు పనులు ముమ్మరంగా జరిగాయి. ఆరేళ్ల క్రితం ఉపాధిహామీ పనుల్లో భాగంగా చెరువుల్లో ముళ్లకంపలు, కంపచెట్లను తొలగించే పనులు చేశారు. అప్పట్లో పెద్ద ఎత్తున అన్ని చెరువుల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈపథకం మంచి ఫలితాలను ఇచ్చింది. ప్రస్తుతం ఉపాధిహామీ పథకం కింద మినీ అమృత్ సరోవర్ పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద చెరువుల్లో పూడికతీత పనులు, చెరువుకట్టమీద కంపచెట్లు తొలగించే పనులతో పాటు చెరువుల్లో కంపచెట్లు తొలగించే పనులు చేపడుతున్నారు. పూడికతీత పనులు చేపట్టే సమయంలో చుట్టుపక్కల కంపచెట్లు తప్పనిసరిగా తొలగించాల్సి ఉంది. ఈపథకంపై గ్రామాల్లో ఉపాధిహామీ సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తే సద్వినియోగం అవుతుంది. తద్వారా సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది.

కంపచెట్లు తొలగించాలి



చెరువులు, కుంటల్లో అల్లుకుపోయిన కంపచెట్లను, ముళ్లపొదలను తొలగించాలి. కంపచెట్లు తొలగిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. పాడిఆవులకు, మేకలు, గొర్రెలకు తాగునీటి వసతి కల్పించవచ్చు. ఇతరత్రా పనులకు చెరువునీటిని వినియోగించుకోవచ్చు. ఆరేళ్ల కిందట ఒకసారి కంపచెట్లను తొలగించారు. మళ్లీ ఇలాంటి పనులను అధికారులు చేపడితే బాగుంటుంది.

– శ్రీరాములు, క్రిష్ణాపురం

రైతులకు అవగాహన కల్పిస్తాం



మినీ అమృత్ సరోవర్ పథకంపై ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పిస్తాం. ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువుల్లో కంపచెట్లను తొలగించే పనులు చేపట్టవచ్చు. ప్రస్తుతం మండలంలోని కొన్నిచెరువులను ఈ పథకం కింద ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించాం. ఇంకా అవసరమైన చెరువుల్లో కూడా ఈపథకం కింద పనులు చేపడతాం.

– జయరామిరెడ్డి, ఏపీఓ, గుర్రంకొండ

రేపు సర్వసభ్య సమావేశం

వాల్మీకిపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీపో సుధాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 2024 ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎంపీపీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ప్రభుత్వం నుంచి జారీ అయిన ఉత్తర్వులు చదివి వినిపించడం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య ప్రగతిపై సమీక్ష, వైద్య, ఆరోగ్య శాఖ ప్రగతిపై సమీక్ష, వ్యవసాయ, విద్యా, సమగ్ర శిక్ష ప్రగతిపై సమీక్ష ఉంటుందన్నారు. సమావేశానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని, సభ్యులు కాని వారికి ప్రవేశం లేదని తెలిపారు.

25న పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మహమూద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి నిర్వహించే సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు మాత్రమే హాజరు కావాలన్నారు. సమావేశంలో ఎలాంటి అజెండా కార్యక్రమాలు ఉండవన్నారు. అన్ని శాఖల, మండల స్థాయి అధికారులు సమగ్రమైన నివేదికలతో హాజరు కావాలని కోరారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

మదనపల్లె సిటీ: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి ప్రారంభంకానున్నట్లు స్థానిక బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి తెలిపారు. పరీక్షలు జూన్ 1వతేదీ వరకు జరుగుతాయన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం మొదటి సంవత్సరం, మధ్యాహ్నం రెండవ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రెమిడియల్ క్లాసులు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించండి

మదనపల్లె : వర్షాకాల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని తట్టివారిపల్లె, దుబ్బిగానిపల్లె, పోతపోలు గ్రామసచివాలయను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లోని అన్ని డ్రైనేజీ కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. బ్లీచింగ్, సున్నం, యాంటీ లార్వా రసాయనాలు మొదలైనవి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మహిళా పోలీసులు తప్పనిసరిగా అంగన్‌వాడీ సెంటర్లు విజిట్ చేయాలని తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ హౌసింగ్ ప్రోగ్రెస్‌పై దృష్టి పెట్టాలన్నారు.



దుబ్బిగానిపల్లె సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుప్రసాద్

యాజమాన్య పద్ధతులపై అవగాహన

కలికిరి: పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై క్షేత్ర స్థాయిలో అవగాహన అవసరమని కేవీకే కో–ఆర్డినేటర్ డా. పాండురంగ అన్నారు. మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు, కేవీకే ఆధ్వర్యంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడి పొందవచ్చని, ఈ మేరకు వ్యవసాయ విద్యార్థులు ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనలను పరిశీలించారు. కార్యక్రమంలో మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.విజయలక్ష్మీ, కలికిరి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్, కేవీకే శాస్త్రవేత్తలు పీరూసాహెబ్, పీవీ గీత, మాధూరి, సోమశేఖర్ బాబు, ఆర్బీకేల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే కో-ఆర్డినేటర్ పాండురంగ

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

పీలేరు రూరల్ : పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చునని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర మాధురి అన్నారు. మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులకు పీలేరు మండలం వేపులుబైలు గ్రామంలో క్షేత్ర స్థాయిలో వ్యవసాయం సాగు పని అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయానికి ఉన్న వనరులు ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వరం

కలకడ : ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు గ్రామీణ ప్రాంత ప్రజలకు గొప్ప వరమని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని నవాబుపేట గ్రామంలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు అందజేశారు. గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం సురక్షితమన్నారు. ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలు, గ్లూకోస్, కాల్షియం, అల్‌బెండజోల్ మాత్రలు వంటివి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. 50 సంవత్సరాలు వయస్సు దాటిన వారికి బీపీ, షుగర్ వ్యాధులుకు రక్తపరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, సాధారణ చికిత్సలు మొత్తం కలిపి 52 మందికి ఉచిత వైద్యసేవలు అందించినట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, 104 సిబ్బంది శివప్రసాద్‌బాబు, భాగ్యమ్మ, రోజా, రమేష్, బాబు, అనంతరాణి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

23, 24న వ్యవసాయ కార్మిక సంఘం

రాష్ట్ర కమిటీ సమావేశాలు

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈనెల 23, 24 తేదీల్లో హార్సిలీహిల్స్‌లో నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ కార్మికసంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ...పుచ్చలపల్లె సుందరయ్య 1934లో స్థాపించిన వ్యవసాయ కార్మికసంఘం నేడు కోటిమంది సభ్యులతో దేశవ్యాప్తంగా విస్తరించి, కష్టజీవుల పక్షాన పోరాటం సాగిస్తోందన్నారు. దేశంలో నేటికీ 65శాతానికి పైగా ప్రజలు వ్యవసాయరంగం మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ఉద్దేశంతో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఫలితంగా వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోయి, దానిమీద ఆధారపడి జీవిస్తున్న ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయరంగ పరిరక్షణ కోసం, గ్రామీణ ప్రజల జీవితాల మెరుగుదల కోసం వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేస్తోందన్నారు. హార్సిలీహిల్స్‌లో ఈనెల 23, 24 తేదీల్లో జరుగుతున్న రాష్ట్ర కమిటీ సమావేశాల్లో రానున్న రోజుల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమాల రూపకల్పనపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశాల్లో అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, అఖిల భారత ఉపాధ్యక్షురాలు విక్రమ్‌సింగ్, రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లుతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరవుతున్నారని తెలిపారు. కరువు ప్రాంతంలో జరుగుతున్న కూలిసంఘం రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు

కలికిరి: రైతులకు ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు అందిస్తోందని, అవసరమైన వారు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి(ఏఓ) మమతారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన ఎంపీడీఓ రామక్రిష్ణయ్య ఆధ్వర్యంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా కలికిరి గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రతాప్ కుమార్ రెడ్డి మృతికి అధికారులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు. అనంతరం అధికారులు శాఖల వారిగా అభివృద్ధి పథకాల నివేదికలను చదివి వినిపించారు. సమీక్షలో భాగంగా ఏఓ మాట్లాడుతూ మండలానికి 1340 క్వింటాళ్ల నారాయణి రకం, టీసీజీఎస్–1694 రకం 100 క్వింటాళ్లు మంజూరయ్యాయని, వీటిలో నారాయణి 30 కిలోల బస్తా ధర రూ.1746, టీసీజీఎస్ బస్తా ధర రూ.1710గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అలాగే జనుములు, జీలుగలు 10కిలోల బస్తా రూ.440 వంతున అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి స్కీం బోర్లుకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతులకు గురైనా ట్రాన్స్‌కో సిబ్బంది స్పందించడం లేదని, రవాణా ఖర్చులుసైతం భరించాల్సి రావడంతో పంచాయతీపై భారం పడుతోందని గుట్టపాళెం సర్పంచ్ వెంకట రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ ముజీబుర్‌రెహ్మాన్ ఇకపై అలాంటి సమస్య తలెత్తకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. వర్షాలు సమృద్ధిగా కురవనున్న నేపథ్యంలో చెరువు, కుంటలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని నాయనచెరువుపల్లి సర్పంచ్ అరుణబాబురెడ్డి అధికారులను కోరారు. ఇరిగేషన్ శాఖ నుంచి నిధులు అందుబాటులో లేనందున ఉపాధిహామీ పథకం ద్వారా మరమ్మతులు చేపట్టవచ్చని ఎంపీడీఓ ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకర్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నూర్జహాన్

స్ట్రాంగ్‌రూమ్‌కు పోస్టల్ బ్యాలెట్లు

తంబళ్లపల్లె: నియోజకవర్గంలో జరిగిన సాధారణ ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్లను మంగళవారం అధికారులు జిల్లా కేంద్రం రాయచోటిలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. స్థానిక ఉపఖజానాలో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్లను ఈఆర్వో రాఘవేంద్ర, ఏఈఆర్వో బ్రహ్మయ్య, ములకలచెరువు సీఐ మధు, ఎస్‌ఐ వెంకటశివకుమార్‌లు రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో 15 పెట్టెలలో భద్రపరిచి పోలీసు బందోబస్తు మధ్య తరలించారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవు

పీలేరు రూరల్ : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో ఘర్షణకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం తలపుల కస్బాలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. కౌంటింగ్ ముగిసిన పదిహేను రోజుల పాటు గ్రామాల్లో ఎక్కడా అల్లర్లు సృష్టించరాదన్నారు. అందరూ ప్రశాంత జీవనం సాగించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరసింహుడు, పోలీస్ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి

ఆర్‌బీకేల్లో వేరుశనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్

మదనపల్లె : మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తన కాయల పంపిణీకి ప్రభుత్వం 1,753 క్వింటాళ్లను కేటాయించిందని ఏఓ నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం విడుదల చేసిన పత్రికాప్రకటనలో... మండలంలోని అన్ని ఆర్‌బీకే కేంద్రాల్లో బుధవారం నుంచి వేరుశనగ విత్తనకాయలకు సంబంధించి, రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా కావాల్సిన రైతుల పేర్లు నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మండలానికి కేటాయించిన 1,753 క్వింటాళ్లలో...1,680 క్వింటాళ్లు కే–6 రకం, 73 క్వింటాళ్ల లేపాక్షి విత్తనం ఉందన్నారు. 30 కిలోల కే–6 రకం వేరుశెనగ బస్తా ధర రూ.1,710, లేపాక్షి రకం బస్తా ధర రూ.1,566 గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలతో అన్ని రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

కురబలకోటలో రిజిస్ట్రేషన్ షురూ

కురబలకోట: వేరుశనగ విత్తన కాయల కోసం రైతులు ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ సహాయకుల వద్ద ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాధ మంగళవారం సూచించారు. పట్టాదారు పాసుబుక్కు, ఆధార్ కార్డు జిరాక్సు కాపీలతో బయోమెట్రిక్ వేయాలన్నారు. ముందుగా విత్తన కాయలకు డబ్బు చెల్లించాలన్నారు. ఓటీపీ కోసం వెంట మొబైల్ తీసుకు రావాలన్నారు. సబ్సిడీ పోను 30 కిలోల కాయల బస్తా రూ.1710 చొప్పున చెల్లించాలన్నారు.

రాయితీ విత్తన కాయల పంపిణీకి సిద్ధం

పీలేరు : ఖరీఫ్ సీజన్‌కు రైతులకు ప్రభుత్వ రాయితీతో వేరుశనగ విత్తన కాయలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఏఓ రమాదేవి తెలిపారు. మంగళవారం ఆమె రైతు భరోసా కేంద్రాలకు చేరిన వేరుశనగ విత్తన కాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు 1770 క్వింటాళ్లు నారాయణి రకం వేరుశనగ కాయలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ రాయితీ పోనూ క్వింట ధర రూ. 5820 నిర్ణయించినట్లు చెప్పారు. విత్తనకాయలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, మొబైల్ నెంబరుతో రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.



వేరుశనగకాయలను పరిశీలిస్తున్న ఏఓ రమాదేవి